క్లుప్తంగా

రోడ్డు వెడల్పు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెడల్పు పనులను బుధవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరిశీలించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పాతమంచిర్యాల నుంచి ఓవర్ బ్రిడ్జి మీదుగా తోళ్లవాగు వరకు రోడ్డు వెడల్పు పనులను రూ.12.39కోట్లతో ప్రారంభించినట్లు, ప్రస్తుతం ఆయా పనులను పూర్తి చేస్తున్నారన్నారు. పెరుగుతున్న వాహనాల దృష్ట్యా రోడ్ల వెడల్పు పనులను చేపట్టనుండగా, వీటిని పూర్తిచేస్తే, ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది ఉండదని తెలిపారు.

తపస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీనివాస్

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా మోకెనపల్లి శ్రీనివాస్‌ను నియమించారు. కన్నెపల్లి మండలం కుర్మగూడ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను నియమిస్తూ బుధవారం తపస్ జిల్లా అధ్యక్షుడు ప్రకటన విడుదల చేశారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో కంది నరేష్, సందెల శశాంక్ స్మారకార్థం మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం16జట్లు పాల్గొనగా, తాళ్లపేట జట్టు విజయం సాధించింది. విజేతలకు బుధవారం బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి (తాళ్లపేట జట్టు) రూ.5వేల నగదు, ద్వితీయ బహుమతి (రాజుగూడ జట్టు) రూ.2500 నగదును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్, మాజీ సర్పంచ్ కాంతారావు, నాయకులు ముస్తఫా, షరీఫొద్దిన్, జంగు, సాధిక్, సల్లూ, మన్సూర్, శ్రీధర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) హాజీపూర్ మండల నూతన కమిటీని బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎల్కటూరి రాజేశ్, ఉపాధ్యక్షుడిగా ఎలకటూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మల్యాల తిరుపతి, ప్రచార కార్యదర్శిగా అడ్లూరి వంశీ, కోశాధికారిగా మల్యాల నర్సయ్య, మండల కో కన్వీనర్‌గా తాళ్లపల్లి అంజి, గౌరవ అధ్యక్షుడిగా సీపెల్లి మొగిళి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్యతో పాటు ఎమ్మార్పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

రెనోవేషన్ కమిటీ సభ్యుడి రాజీనామా

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానం రెనోవేషన్ కమిటీ సభ్యుడు ముఖేష్, తన రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో ముక్తా రవికి అందజేశారు. ప్రభుత్వం మారటంతో రెనోవేషన్ కమిటీకి చేసిన రాజీనామాను ఆమోదించాలని పేర్కొన్నారు.

రేపు జన్నారం, కాసిపేట మండలాల సమావేశం

కాసిపేట/జన్నారం: ఈ నెల 19న కాసిపేట, జన్నారం మండలాల సర్వసభ్య సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు అరుణరాణి, ఎంఏ అలీం తెలిపారు. ఆయా మండలాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వచ్చే నెల 16న రెడ్‌క్రాస్ సమావేశం


రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్ రెడ్డి

మంచిర్యాల టౌన్: వచ్చే నెల 16వ తేదీన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహణతో పాటు, నూతన కార్యవర్గ ఎంపిక ప్రక్రియ ఉంటుందని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 16న జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో వార్షిక సర్వసభ్య సమావేశాన్ని రెడ్‌క్రాస్‌కు చెందిన ప్యాట్రన్స్, వైస్ ప్యాట్రన్స్, లైఫ్ మెంబర్లు, లైఫ్ అసోసియేట్‌లతో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నమోదు అయిన శాశ్వత సభ్యత్వం పొందిన వారందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.



ఊరచెరువు నిరుపయోగం..!

- మత్తడి కొట్టుకుపోయినా మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు
- రెండేళ్ల నుంచి నిర్లక్ష్యమే...
- వంద ఎకరాల్లో నిలిచిన సాగు


కొట్టుకుపోయిన చెరువు మత్తడి

భీమారం: మండలంలోని కొత్తపల్లిలో గతంలో నిర్మించిన చెరువు..ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఆ చెరువు వల్ల దాదాపు 160ఎకరాల వరకు రైతులు సాగునీరు వినియోగించుకునేవారు. కాగా రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు ఆ చెరువు మత్తడి కొట్టుకుపోయింది. అప్పటి నుంచి గ్రామస్తులు మత్తడిని పునర్‌నిర్మించాలని కోరుతున్నా.. పాలకులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

గండి పడటంతో కష్టాలు మొదలు...

ఊర చెరువు మత్తడికి గండి పడటంతో గ్రామ రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. చెరువులో ఉన్న మట్టిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో నీటి సామర్థ్యం తగ్గుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఇప్పటివరకు ఫలితం రాలేదు. అప్పటి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన చెరువు మత్తడి నిర్మాణానికి రూ.1.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో చెరువు నిరుపయోగంగా మారిందని రైతులు అంటున్నారు. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న తాము, ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వాలకు తమ కష్టాలు కనపడటం లేదా అని ప్రశ్నిస్తున్నారు. మండలంలో పెద్ద చెరువుల్లో ఒకటైన కొత్తపల్లి ఊర చెరువు గురించి పాలకులు ఇంత నిర్లక్ష్యం చూపడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నష్టపోతున్నాం...



ఊర చెరువును నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటున్నాం. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు రైతులకు తీరని నష్టం కలిగించే విధంగా మత్తడి కొట్టుకుపోయింది. దీంతో రెండేళ్ల నుంచి వరిపొలాలు పండించడం లేదు. గ్రామంలోని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం చర్యలు తీసుకొని కొత్తగా మత్తడి నిర్మించాలి.

– బొమ్మని గౌరయ్య, రైతు, కొత్తపల్లి

ప్రతిపాదనలు పంపాం

కొత్తపల్లి గ్రామ శివారులోని ఊరచెరువు మత్తడి నిర్మాణంతో పాటు చెరువుకి మరమ్మతులు చేసేందుకు రూ.1.50కోట్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– శారద, నీటిపారుదలశాఖ డీఈ

నేడు పవర్‌కట్ ప్రాంతాలు



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలో రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రేగుంట స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల రామ్‌నగర్ ఫీడర్, పాత కలెక్టరేట్ ఏరియా, గోశాల, ఐబీచౌరస్తా ఏరియా, ఎల్ఐసీ కాలనీ, మేదరివాడ, పాత మంచిర్యాల, తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని మండల డిస్కం డీఈ బి.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ సబ్ స్టేషన్‌లో 33కేవీ లైన్ మరమ్మతులు చేపట్టనుండటంతో బోయపల్లి, చౌటపల్లి, తాండూర్, ఐబీ, కొత్తపల్లి, మాదారం, అబ్బాపూర్, బెజ్జాల్ గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

22న అన్ని దేవాలయాల్లో రామ సంకీర్తన


పాల్గొన్న కుల సంఘాల నాయకులు

చెన్నూర్: అయోధ్యలో బలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న చెన్నూర్ పట్టణంలోని అన్ని దేవాలయాల్లో రామ సంకీర్తన, శ్రీరామ జపం కార్యక్రమాలు నిర్వహించాలని కుల సంఘాల నాయకులు నిర్ణయించారు. బలరాముని ప్రాణప్రతిష్ఠ విజయవంతం చేయాలని బుధవారం స్థానిక జగన్నాథాలయంలో రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సంయోజక్ అధ్యక్షతన కుల సంఘాల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ నెల 21న ఆదివారం సాయంత్రం 4గంటలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప దేవాలయం నుంచి జగన్నాథాలయం వరకు శోభాయాత్ర, 22న జగన్నాథాలయం, అయ్యప్ప ఆలయాల్లో అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, రాజబాపు, రత్న లక్ష్మీనారాయణరెడ్డి, కారెంగుల రామయ్య, నాయిని కిష్టయ్య, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాముడి పాదుకలతో గూడెంలో పూజలు



దండేపల్లి: అయోధ్యలో పూజించబడి, కొండగట్టుకు తీసుకెళ్తున్న శ్రీరాముడి పాదుకలు బుధవారం దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చేరుకున్నాయి. దీంతో పాదుకలను తీసుకొస్తున్న భక్తులు, వాటితో గూడెం గుట్టపై గల శ్రీసత్య నారాయణస్వామిని దర్శించుకున్నారు.

'ఓటమి గెలుపునకు నాంది'


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

నెన్నెల: ఓటమి చెందిన వారు నిరాశ చెందకూడదని, ఓటమి మరో ఆటలో గెలుపునకు నాంది పలుకుతుందని ఎస్సై శ్యాంపటేల్ అన్నారు. మండల కేంద్రంలో సుంకరి పుల్లమ్మ, బుచ్చయ్య జ్ఞాపకార్థంగా బుధవారం ఏర్పాటు చేసిన మూడు మండలాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను సర్పంచ్ తోట సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ టోర్నీలో 26జట్లు పాల్గొన్నాయి. విజేతగా చంద్రవెల్లి జట్టు, రన్నరప్‌గా అచ్చులాపూర్ జట్టు నిలిచాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చితే స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీయడానికి ఇలాంటి ఆటల పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీ తిరుపతి, నిర్వాహకులు సుంకరి శ్రీను, సుంకరి రవీందర్, అభి, మణి, శ్రీమన్, నాయకులు తోట శ్రీనివాస్, బానేష్, సాంబమూర్తి, శంకరయ్య, గోవింద్‌సింగ్ పాల్గొన్నారు.

కొత్త మామిడిపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర

దండేపలి: మండలంలోని కొత్తమామిడిపల్లిలో మోదీ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రచార రథంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, నోడల్ అధికారి అనిల్, సర్పంచ్ రాజయ్య, ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ సిబ్బంది నాగరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్


నెన్నెల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బెల్లంపల్లి నియోజకవర్గాన్ని విడతల వారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. నెన్నెల రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తన సొంత నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తానన్నారు. బెల్లంపల్లి ప్రగతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి మొదటి విడతగా రూ.10కోట్లు కేటాయించారన్నారు. బాధ్యతతో ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని, బెల్లంపల్లిలోనే ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను కలిస్తే సమస్యల పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో నియోజకవర్గంలో ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. మండలాల్లో ఉన్న పోడు భూముల సమస్యను పరిష్కరించి నిరుపేదలకు పట్టాలు అందేలా చూస్తానని మాటిచ్చారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు అన్యాయం జరగకుండా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సీనియర్ నాయకులకు నామినేట్ పోస్టులలో అవకాశం కల్పించే బాధ్యత నాదని చెప్పారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు ఎమ్మెల్యే వినోద్‌ను శాలువాలతో సన్మానించారు. అనంతరం చిన్నలంబాడితండాలో రూ.5లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు, గొల్లపల్లిలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, మరో రూ.5లక్షల సైడ్‌డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అక్కడి నుంచి కొత్తూర్‌లో తలండి దుర్గమ్మ, రాములు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ఐదు మండలాల క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతగా నిలిచిన జైపూర్ మండలంలోని మెట్‌పల్లి, రన్నరప్‌గా నిలిచిన చిత్తాపూర్ జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, ఎంపీటీసీలు హరీష్‌గౌడ్, దాగం రమేష్, సర్పంచులు తోట సుజాత, సంధ్య, నాయకులు కిషన్‌రెడ్డి, తోట శ్రీను, మహేష్, గట్టు బానేష్, సాంబమూర్తి, మొహిద్ ఖాన్, మల్లీక, గోవింద్‌సింగ్‌లు పాల్గొన్నారు.

'సీడీఎస్ మాజీ అధ్యక్షురాలికి పరామర్శ'

వేమనపల్లి/బెల్లంపల్లి: పుత్రశోకంతో బాధపడుతున్న బెల్లంపల్లికి చెందిన సీడీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, సీనియర్ నాయకురాలు తోడే పద్మారెడ్డిని బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరామర్శించారు. పద్మారెడ్డి చిన్న కుమారుడు తోడే వంశీకృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంచిర్యాలలో ఉన్న పద్మారెడ్డి ఇంటికి వెళ్లి వంశీకృష్ణారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పద్మారెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంతకుముందు ఎమ్మెల్యే కొండగట్టు అంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్‌కుమార్, నాయకులు సాబీర్ అలీ తదితరులు ఉన్నారు.

ప్రణాళికలతో పనులు చేపట్టాలి

- ఊరూరా జీపీడీపీ గ్రామసభలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్


దండేపల్లి: పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

భీమారం: గ్రామాల్లో ముందస్తుగా ప్రణాళికల ద్వారానే అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. 2024–25ఆర్థిక సంవత్సరంలో మండలంలోని దాంపూర్, కాజిపల్లి, ధర్మారంలో చేపట్టనున్న పనులపై బుధవారం గ్రామాల్లో చేపట్టిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ప్రతి పనిని ప్రణాళికతో చేపడితే అనుకున్న సమయంలో పనులను పూర్తి చేయొచ్చన్నారు. గ్రామాల్లో చేపట్టే పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి బడ్జెట్ ఎక్కువ పెట్టేలా చూస్తున్నామని ఆయన తెలిపారు. సర్పంచులు దాడి తిరుపతి, సంతోషం భాస్కర్ రెడ్డి, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేమనపల్లిలో జీపీడీపీ గ్రామసభ

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం, జిల్లెడ, సూరారం గ్రామపంచాయతీల్లో సర్పంచులు గొగర్ల శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, రమేష్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం 2024–25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీపీడీపీ అవగాహన గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు హాజరై ఆర్థిక, సామాజిక అత్యవసర సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఈ గ్రామస్వరాజ్ పోర్టల్‌లో అభివృద్ధి ప్రణాళికలు నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ వీరయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు భాగస్వాములు కావాలి'

జైపూర్: మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు(జీపీడీపీ) తయారుపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–2025ఏడాదికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు తయారు, చేపట్టబోయే అభివృద్ధి పనుల అంశంపై అధికారులతో పాటు ప్రజాప్రతినిధులతో చర్చించారు. స్థానిక సంస్థల అభివృద్ధి ప్రణాళికలో అన్నిశాఖల అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీపీ గోదారి రమాదేవి తెలిపారు. మండల, గ్రామపంచాయతీల స్థాయిలో ఆర్థిక, సామాజిక అత్యవసర సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో స్థానిక వనరులను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో ఎంపీవో అనిల్‌కుమార్, ఆయాశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దండేపల్లిలో జీపీడీపీ ప్రణాళికపై గ్రామసభలు

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జీపీడీపీ (పంచాయతీ అభివృద్ధి) ప్రణాళికల తయారీపై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా గత ప్రభుత్వం అభివృద్ధి పనులకు సరైన నిధులు మంజూరు చేయకపోవడంతోనే, చాలా పనులు అసంపూర్తిగా మిగిలాయని, దండేపల్లిలో జరిగిన గ్రామసభలో ఎంపీటీసీ శ్రీనివాస్ ఆరోపించారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది


పోటీలు ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీ వైస్ చైర్మన్

చెన్నూర్: క్రీడా పోటీలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. స్థానిక జెండవాడ మైదానంలో బుధవారం మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ సుల్తాన్‌అహ్మద్, జంషీద్‌ల స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలకు చెన్నూర్ పెట్టింది పేరన్నారు. మండల స్థాయిలోనే ఆగకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు ముస్తాక్, కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

కాసిపేట: మండలంలోని కోమటిచేను, పల్లంగూడ, బుగ్గగూడ గ్రామపంచాయతీల్లోని నర్సరీలను బుధవారం ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వహణలో అశ్రద్ధ చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీలలోని మొక్కలతో పాటు రోడ్డుపక్కన నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయాలన్నారు. ఈజీఎస్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఏపీవో నవీన్‌కుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులున్నారు.

31వ వార్డులో ఉచిత ఆరోగ్య పరీక్షలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్‌లోని 31వార్డు మహ్మద్ ఖాశీం బస్తీ ప్రజలకు బుధవారం ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఓ ప్రైవేట్ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఆ వార్డు కౌన్సిలర్ గెల్లి రాజలింగు పర్యవేక్షణలో ప్రజలకు 20రకాల పరీక్షలు చేయించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరై పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీజీ శంకర్ సింగ్, వార్డు ప్రజలు, ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారలమ్మల మొక్కులు ప్రారంభం


ఎత్తు బంగారం ఇస్తున్న భక్తులు

బెల్లంపల్లి: ప్రతి రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క, సారలక్కల జాతర వేడుకలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల నుంచి ములుగు జిల్లా మేడారంలో మహా జాతర జరగనుంది. జాతరను పురస్కరించుకుని వనదేవతలైన సమ్మక్క, సారలక్కలకు మొక్కులు చెల్లించుకునే ప్రక్రియ ప్రారంభమైంది. బెల్లంపల్లిలో బుధవారం సమ్మక్క, సారలమ్మల భక్తులు నిలువెత్తు బంగారం తూగించుకున్నారు. బజారుఏరియా, పాత బస్టాండ్ ఏరియాల్లో ఉన్న కిరాణాషాపుల వద్ద బెల్లం, చక్కెర నిలువెత్తు తూగడానికి భక్తులు బారులు తీరారు. ఇంటిల్లి పాది బెల్లం ముద్దలను నెత్తిన ఎత్తుకుని సాంప్రదాయ బద్ధంగా, భక్తి శ్రద్ధలతో ఇంటికి తీసుకెళ్లారు. ఇంటివద్ద వన దేవతలకు ప్రత్యేక పూజలు చేసి బంగారాన్ని చుట్టు పక్క ప్రజలకు పంచి పెట్టారు. జాతర మొక్కులు ప్రారంభం కావడంతో కోలాహలం కనిపించింది.

మందమర్రిరూరల్: సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో మందమర్రి పట్టణంలో సమ్మక్క సారలమ్మ భక్తుల సందడి పెరిగింది. పట్టణంలోని భక్తులు మొక్కుబడిగా మార్కెట్ లోని దుకాణాల వద్దకు వెళ్లి ఎత్తు బంగారం(బెల్లం) కొనుగోలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో మార్కెట్లోని బెల్లం దుకాణాలు సందడిగా మారాయి.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899